NEELAGIRI VARTHA TELUGU DAILY

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త

APTEL/2009/31957 తెలుగు దినపత్రిక

తెలంగాణ ఎడిటర్ : గుంటోజి విష్ణుమూర్తి, శుక్రవారం 04-10-2024 సంపుటి : 15 సంచిక : 98, పేజీలు 13 వెల : 4/-



3 లో..

## మార్కెట్లపై యుద్ధ మేఘాలు



3 లో..

## భారత్‌లో మస్సే ఫెర్గూసన్ బ్రాండ్ మాదే..

# ఫామ్ హౌస్‌లు కాపాడుకోవడానికే బిఆర్ఎస్ రాజకీయాలు

- డిజిటల్ కార్డు.. ఫ్యామిలీకి రక్ష!
- ఒకే కార్డులో అన్ని వివరాలు
- 30 శాఖలతో క్రోడీకరించిన సమాచారం
- పథకాలు పొందేందుకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు దోహదం
- సికింద్రాబాద్ సిఖ్ కాలనీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభం
- సబితమ్మ.. మీ ఫామ్ హౌస్ లెక్క కూడా ఉంది
- ఈటల రాజేందర్ రావాలి..
- మోదీ దగ్గరకే పోదాం.. ఏమి ఇప్పిస్తారో చూద్దాం
- ఫామ్ హౌస్ కాపాడుకోవడానికే ఈ రాజకీయాలు
- కేటీఆర్.. హరీశ్‌పై మండిపడ్డ రేవంత్ రెడ్డి



హైదరాబాద్ :నీలగిరి వార్త ప్రతినిధి

**పేదలను అడ్డం పెట్టుకొని ఫాం హౌస్‌లు కాపాడాలని చూ స్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ఆక్రమించిన వారికి ఎలా సాయం చేద్దాం అనేది చెప్పండి? డబుల్ బెడ్ రూం ఇచ్చామని, చదువుకు స్కూల్ పెడు తున్నామని, ఈటెల కు వచ్చిన దుఃఖం ఏంది? వాళ్ళు బాగుండటం ఇష్టం లేదా? అని ప్రశ్నిం చారు. చెరువుల్లో నిర్మాణాలు తొలగిం చాల్సిందే అని, నాలాలాపై నిర్మాణాలు తొలగించాల్సిందే అని స్పష్టం చేశారు. మూసీ బాధితులకు ఇల్లుతో పాటు, ఖర్చులకు రూ.15 వేలు ఇచ్చామన్నారు.**


సికింద్రాబాద్ లోని సిఖ్ కాలనీలో ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ పైలట్ కార్యక్రమాన్ని నేడు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నల్గొండలో అడుగు పెట్టండి.. మూసీ తో పంటలు ఎంత కాలుష్యమవుతున్నాయని సీఎం ఆవేదన వ్య క్తం చేశారు. . నల్గొండ ప్రజా కోసం ప్రక్షాళన చేయాలన్నారు. తాను భవిష్యత్ కోసం ఆలోచన చేస్తున్నాని, అయితే కేటీఆర్.. అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. సబితమ్మ పేద అరుపులు అరవకు అని అన్నారు. మీ ముగ్గురు కొడుకుల ఫాం హౌస్ లు లేవా..? అని ప్రశ్నించారు. మీ ఫామ్ హౌస్‌ల లెక్క కూడా ఉందని చెప్పారు. హరీష్ రావుకు అమీన్‌పూర్‌లో ఫాం హౌజ్ ఉంది కదా? అది అక్రమం కాదా..? అని ప్రశ్నించారు.



# కాంగ్రెస్‌లో మళ్లీ కలహాలు మొదలయ్యాయా?

- ప్రజల కష్టాలు తెలుసుకోడం కంటే గొడవలకే ప్రాముఖ్యత?
- హైడ్రా నిర్ణయం తప్పని స్వపక్ష నేతలే ధిక్కార స్వరం?
- తాజాగా మంత్రి సురేఖ సమంత కేటీఆర్‌ల పై చేసిన వ్యాఖ్యలు?
- విపక్ష పార్టీలకు అస్త్రాలుగా మారుతున్న నేపథ్యం?
- సెల్ఫ్ డిఫెన్స్‌లో రేవంత్ ప్రభుత్వం పడిందన్న చర్చ?

వార్త 4లో



## ఆ తీర్పుపై స్టే ఇవ్వలేం..

వార్త 2లో

**అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు స్పష్టం**

తెలంగాణ ఎమ్మెల్యేల అనర్హతపై సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే ఇచ్చేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది. సింగిల్ బెంచ్ తీర్పుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఈ నెల 24న వాదనలు వింటామని తెలిపింది.కేసు వివరాలలోకి వెళితే సెప్టెంబర్ 9న ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్లపై విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ మూడు అంశాలపై ప్రధానంగా చర్చించింది.



## మూసీ సుందరీకరణకు బీజం వేసిందే బీఆర్ఎస్

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

మూసీ సుందరీకరణకు బీజం వేసిందే బీఆర్ఎస్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అప్పట్లో మూసీ సుందరీకరణకు బీజం వేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారం కోల్పోగానే మూసీ బెల్ట్ ఏరియాలోని నిరుపేదలు ఆ పార్టీకి గుర్తొచ్చారని ఎద్దేవా చేశారు.

వార్త 2లో

## బండి సంజయ్ ప్రత్యేక పూజలు



కరీంనగర్ నీలగిరి వార్త ప్రతినిధి

దేవీ నవరాత్రి ఉత్సవాలు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహాశక్తి ఆలయంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రి వేడుకల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుండి భవాని మాలాదారులతో పాటు భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తొలి రోజు వేడుకల్లో పాల్గొని బాలాత్రిపుర సుందరిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారు తెలంగాణ ప్రజలను చల్లగా చూడాలని, సుఖ సంతోషాలు ప్రసాదించాలని వేడుకున్నామన్నారు. నవరాత్రి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మహాశక్తి ఆలయంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశామన్నారు.

## శ్రీవారి ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలపై టీటీడీ ఈవో కీలక ప్రకటన

తిరుమల, నీలగిరి వార్త ప్రతినిధి

తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు రేపటి (శుక్రవారం) నుంచి ప్రారంభంకానున్నాయి. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం మీడియాతో మాట్లాడుతూ.. రేపటి నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయని.. ఇప్పటికే ఉత్సవ ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. వాహన సేవలు ఉదయం 8 గంటలకు.. రాత్రి 7 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

## అజారుద్దీన్‌కు ఈడీ సమన్లు..

**మనీ లాండరింగ్ కేసులో నేడు విచారణ**

**రూ.20కోట్ల దుర్వినియోగంపై ఆరోపణలు**

హైదరాబాద్ నీలగిరి వార్త ప్రతినిధి

మనీలాండరింగ్ కేసులో భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్‌కు ఈడీ సమన్లు ??జారీ చేసింది. రూ.20 కోట్ల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆయనపై ఆరోపణలు వచ్చిన సంగతి విదితమే. ఈ రోజే హైదరాబాద్ లోని ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది.




# భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

హైదరాబాద్ నీలగిరి వార్త ప్రతినిధి

ఓ ఆర్ఆర్ నుంచి రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) వరకు ప్రధానమైన నాలుగు రహదారులు విస్తరణ విషయంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం లేదా భూమి కేటాయించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూ నిర్వాసితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని హెచ్చరించారు. పేద రైతుల స్థలాలను గుంజుకుని రైతులను బిచ్చగాళ్లను చేస్తానంటే ఎవరు ఊరుకోరని ఆయన హెచ్చరించారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని అన్నారు. హైదరాబాద్ ధర్నాచౌక్‌లో ట్రిపుల్ ఆర్ రోడ్డు విస్తరణ సందర్భంగా భూనిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థలాలు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయంగా స్థలాలు, ఆర్థిక సహకారాన్ని అందించాల ని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ట్రిపుల్ ఆర్ చుట్టుపక్కల ఉన్న రైతులంతా పెద్ద సంఖ్యలో ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ ధర్నాలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్,బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలా శేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు.



## కొండా సురేఖపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

హైదరాబాద్, నీలగిరి వార్త ప్రతినిధి

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తోపాటు టాలీవుడ్‌లోని పలువురు హీరోయిన్లపై తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తెలంగాణ మంత్రి కొండా సురేఖపై ఆ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందులోభాగంగా గురువారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు. మంత్రి బుధవారం చేసిన ఈ వ్యాఖ్యలు స భ్య సమాజం తలదించుకు నేలా ఉన్నాయని వారు విమర్శించారు. ఇటువంటి నిరాధారమైన ఆరోపణలు చేసిన కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని బం జారాహిల్స్ పోలీస్ స్టేషన్ లో వారు ఫిర్యాదు చేశారు. అయితే కొండా సురేఖ చేసిన నిరాధారమైన ఆరోపణలు వెనక్కి తీసుకొని.. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.



# ఆ తీర్పుపై స్టే ఇవ్వలేం..

## అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు స్పష్టం

హైదరాబాద్ నీలగిరి వార్త ప్రతినిధి

తెలంగాణ ఎమ్మెల్యేల అనర్హతపై సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే ఇచ్చేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది. సింగిల్ బెంచ్ తీర్పుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఈ నెల 24న వాదనలు వింటామని తెలిపింది.కేసు వివరాలలోకి వెళితే సెప్టెంబర్ 9న ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్లపై విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ మూడు అంశాలపై ప్రధానంగా చర్చించింది. బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్లు అసెంబ్లీ కార్యదర్శి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పెండింగ్ పిటిషన్లకు సంబంధించిన అంశాన్ని స్పీకర్ దగ్గరకు తీసుకెళ్లాలి. అనర్హత వేటుకు సంబంధించిన అంశాల్లో వాదనలు వినాలి. అలాగే షెడ్యూల్ ఖరారు చేయాలి. వీటన్నింటికి సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను హైకోర్టుకు సమర్పించాలన్నదే ఆ తీర్పులోని సారాంశం. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని, స్టేటస్ రిపోర్ట్‌ను తమకు అందజేయాలని తీర్పిచ్చింది.

### గడువు ముగుస్తుండగా స్టే కోసం పిటిషన్

అయితే కోర్టు ఇచ్చిన నాలుగు వారాల గడువు ముగియనుంది. ఈ తరుణంలో రెండ్రోజుల క్రితం అసెంబ్లీ కార్యదర్శి డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపైన స్టే విధించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనికి సంబంధించి మూడు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లపై ఇవాళ హైకోర్టులో విచారణ జరిగింది. విచారణ సమయంలో అడ్వకేట్ జనరల్ ఈ అంశంపై స్టే విధించి, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అయితే దీనిపై హైకోర్టు డివిజన్ బెంచ్ మాత్రం అందుకు అంగీకరించలేదు. అసెంబ్లీ కార్యదర్శి తరుఫున కోర్టులో వాదించిన అడ్వకేట్ జనరల్ చెప్పే విషయాలన్నింటిని తాము వినేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ నెల 24న వాదనలు వింటామని సూచించింది.

# మూసీ సుందరీకరణకు బీజం వేసిందే బీఆర్ఎస్

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ : నీలగిరి వార్త ప్రతినిధి

మూసీ సుందరీకరణకు బీజం వేసిందే బీఆర్ఎస్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ%ొ% పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అప్పట్లో మూసీ సుందరీకరణకు బీజం వేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారం కోల్పోగానే మూసీ బెల్ట్ ఏరియాలోని నిరుపేదలు ఆ పార్టీకి గుర్తొచ్చారని ఎద్దేవా చేశారు.అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి ఒక్క మంచి పని కూడా చేయలేదని ఆరోపించారు. నిరుపేదలు నివాసం ఉంటున్న బస్తీలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఇలా.. కూల్చివేతలతో సర్కార్ మంచి పేరు తెచ్చుకోవాలనుకుంటుందా అని ప్రశ్నించారు.

### ఏకపక్షంగా పేదల ఇళ్లు కూల్చివేత

%పేదల ఇళ్ల కూల్చివేతల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం అందరికీ మంచి చేయాలని, ఇలా ఇబ్బంది పెట్టే పనులు చేయకూడదని హితవు పలికారు. పేదల ఇళ్ల కూల్చివేతలకు తమ పార్టీ విరుద్ధమన్నారు.

### మంత్రి సురేఖ వ్యాఖ్యలపై ఖండన

అక్కినేని కుటుంబం, హీరోయిన్ సమంతపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. బాధ్యతాయు తమైన పదవిలో ఉండి మహిళగా ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. మహిళలు, కుటుంబాల గురించి మాట్లాడటం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అలవాటైపోయిందని మండిపడ్డారు. ఇలాంటి సంస్కృతిని కేసీఆర్, కేటీఆర్ మొదలు పెడితే.. రేవంత్ అండ్ కో కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయాల్లో ఇలాంటి నాయకులను బహిష్కరించాలని కిషన్‌రెడ్డి అన్నారు.

# దలాల్ స్ట్రీట్‌లో యుద్ధ భయాలు

## మార్కెట్‌ను కుదిపేసిన ఘర్షణ వాతావరణం

## ఆవిరైన దాదాపు రూ.11 లక్షల కోట్లు

ముంబయి,నీలగిరి వార్త ప్రతినిధి

దలాల్ స్ట్రీట్‌లో యుద్ధ భయాలు అలముకొన్నాయి. ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య మదురుతున్న ఘర్షణ వాతావరణం మార్కెట్‌ను కుదిపేసింది. దీంతో సూచీలు కకావికలమయ్యాయి. దీనికి ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌పై సెబీ తీసుకున్న కఠిన నిర్ణయాలూ తోడయ్యాయి. ముఖ్యంగా రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. దీంతో సెన్సెక్స్ 1750కి పైగా పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 25,250 స్థాయికి చేరింది. మదుపర్ల సంపద దాదాపు రూ.11 లక్షల కోట్లు ఆవిరైంది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.464.3 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఆరంభంలోనే సూచీలు భారీ నష్టాలు చవిచూశాయి. ఉదయం 83,002.09 వద్ద నష్టాల్లో ప్రారంభమైన (క్రితం ముగింపు 84,266) సెన్సెక్స్ రోజంతా పడుతూనే ఉంది. ఇంట్రాడేలో 82,434.02 వద్ద కనిష్టాన్ని తాకిన సూచీ చివరికి 1769.19 పాయింట్ల నష్టంతో 82,497.10 వద్ద ముగిసింది. నిఫ్టీ 546.80 పాయింట్ల నష్టంతో 25,250.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.97 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (1.18 శాతం) మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టపోవడం గమనార్హం. ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, రిలయన్స్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ మళ్లీ 75.27 డాలర్ల స్థాయికి చేరింది. బంగారం ఔన్సు 2665.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది. పశ్చిమాసియాలోని ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఎటువైపు దారితీస్తాయోనన్న ఆందోళనలు మదుపర్లలో నెలకొన్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న భయాల నేపథ్యంలో ముడి చమురు ధరలు పెరగడం మరో కారణం. ఇన్నాళ్లు 70–71 డాలర్ల వద్ద కొనసాగిన బ్యారెల్ ముడి చమురు ధర 75 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌కు సంబంధించి నిబంధనలను ఇటీవల సెబీ కఠినతరం చేయడం కూడా మార్కెట్ నష్టాలకు మరో కారణం. ఇటీవల చైనా ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపన చర్యలతో ఆ దేశానికి చెందిన స్టాక్స్ రాణిస్తున్నాయి. దీంతో భారత్ నుంచి పెట్టుబడులు తరలిపోతున్నా యన్న ఆందోళనలూ మరో కారణంగా భావిస్తున్నారు.

# ఏపీలో సీడ్ పథకం అమలు : మంత్రి సవిత

విజయవాడ, కేందప్రభుత్వం సహకారంతో ఏపీలో సీడ్ పథకం అమలు చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామంత్రి ఎస్ సవిత తెలిపారు. విజయవాడలో బీసీ సంక్షేమ శాఖలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలుపై నిర్వహించిన వర్క్ షాప్‌లో మంత్రి ఎస్ సవిత పాల్గొన్నారు. ఏపీలో ఇప్పటికే 6 జిల్లాలో సీడ్ పథకం అమలు... త్వరలో మిగిలిన 20 జిల్లాల్లో అమలు చేస్తున్నామని వివరించారు. సీడ్ పథకం కింద బీసీ– ఏలో ఉన్న సంచార జాతుల జీవన ప్రమాణాలు పెంచేలా నిర్ణయం తీసుకుంటున్నామని మంత్రి ఎస్ సవిత అన్నారు. 00 బీసీ హాస్టళ్లలో ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. బీసీ హాస్టళ్లను తరుచూ సందర్శించాలని జిల్లా అధికారులను మంత్రి సవిత ఆదేశించారు. బీసీ హాస్టళ్లు , గురుకుల పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

## బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

## అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి శోభ



విజయవాడ, నీలగిరి వార్త ప్రతినిధి

తెలుగు రాష్ట్రాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. ప్రధాన ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు సాగుతున్నాయి. ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాల్లో అమ్మవారు రోజుకో రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో దేవీనవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏపీలోని పలు అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాల సందడి నెలకొంది. తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ఇప్పటికే శరన్నవరాత్రి ఉత్సవాలు మొదలయ్యాయి. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. వివిధ నైవేద్యాలను సమర్పించారు. భక్తులు కూడా తెల్లవారుజాము నుంచే ఆలయాలకు క్యూ కట్టారు. ఉత్సవాల్లో భాగంగా రోజుకొక రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిస్తుంటారు అమ్మవారు. నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవగా.. చివరి రోజు దుర్గాష్టమితో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియనున్నాయి.

ఈరోజు ఒక్కో ఆలయంలో ఒక్కో రూపంలో ఆ దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. తొలిరోజు విజయవాడలో శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారికి స్నాపనాభిషేకం అనంతరం 9 గంటలకు దర్శన భాగ్యం కల్పించారు. తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని చూసేందుకు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే వినాయకుని గుడి వద్ద నుంచి క్యూ లైన్‌లో భక్తులు వేచి ఉన్నారు. శ్రీశైలం శ్రీ భ్రమరాంభికా మల్లికార్జున స్వామి దేవాలయంలో దసరా దేవిశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. శ్రీస్వామి, అమ్మవారి యాగశాల ప్రవేశంతో ప్రత్యేక పూజలు చేసి దసరా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు అర్చకులు. దసరా మహోత్సవాలను ఆలయ అర్చకులు, ఈవో పెద్దిరాజు దంపతులు ప్రారంభించారు. ఈరోజు సాయంత్రం శైలపుత్రిగా భ్రమరాంబికాదేవి భక్తులకు దర్శనమివనున్నారు. బృంగివాహనంపై కన్నులపండువగా శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్సవం జరుగనుంది. ఏలూరు జిల్లాలో ఈరోజు నుంచి ఈ నెల 12 వరకు ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ ఆలయంలో దసరా శర్నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాలలో రోజుకోక అలంకరణలో భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కలుగనుంది. ఈరోజు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు కుంకుళ్లమ్మ దర్శనమిస్తున్నారు. ఆ దేవదేవి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈరోజు శ్రీ సువర్ణ రజిత కవచ అలంకారణలో భక్తులకు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారు దర్శనమిస్తున్నారు. అమ్మవారి దర్శనం కోసం ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో కలకత్తా కాళీమాతగా కొలవబడుతున్న ఈడేపల్లిలోని శ్రీ శక్తి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం శక్తి పటాల ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. కలకత్తాలో మాదిరి దసరా తొమ్మిది రోజులు ఇక్కడ కూడా శక్తి పటాలు కట్టడం అనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ పాలకవర్గం అన్ని ఏర్పాట్లు చేసింది. కాకినాడలోని అన్నవరం దేవస్థానంలో శరన్నవరాత్రులు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానంలో వెలసిన వనదుర్గ, కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మొదటి రోజు బాలా త్రిపుర సుందరి దేవి అవుతారంతో భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. విజయవాడ, బాసర, శ్రీశైలం, జోగులాంబ, భద్రకాళి ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి.

# పాలమూరు జిల్లాలో శరన్నవరాత్రివేడుకలు

## జోగులాంబ ఆలయంలో ఉత్సవాలకు శ్రీకారం

## అమ్మవారి దర్శనం కోసం భారీగా తరలివచ్చిన భక్తులు

మహబూబ్‌నగర్, నీలగిరి వార్త ప్రతినిధి

ఉమ్మడి పాలమూరు జిల్లాలో శరన్నవరాత్రివేడుకలు ప్రారంభం అయ్యాయి. ఆలయాల్లో శైవ సంప్రదాయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు, వైష్ణవ సంప్రదాయంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఇదే మాసంలో నిర్వహిస్తారు. కొత్తగా పెళ్లయిన ఆడబిడ్డలు పుట్టింటికి చేరుకుంటారు. ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండగ నిర్వహిస్తారు. రకరకాల పిండివంటలు చేసుకుంటారు. ఊరూరా నెలకొల్పే దుర్గామాత విగ్రహాల వద్ద కోలాటాలు, బతుకమ్మ ఆటలతో సాంస్కృతిక శోభ ఉట్టిపడనుంది. పాండవులు జమ్మిచెట్టు మీద దాచిన ఆయుధాలను తీసుకుని యుద్ధం చేసి శత్రువులను ఓడించిన వృత్తాంతాన్ని గుర్తుచేసుకుంటూ దసరా రోజు సాయంత్రం వేళ ప్రజలు జమ్మిచెట్టుకు పూజలు చేస్తారు. అనంతరం శమీపత్రాలను తల్లిదండ్రులు, పెద్దలకు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. పలు చోట్ల రావణ దహనం కార్యక్రమం చేపడతారు.ఐదో శక్తిపీఠం అలంపూర్ జోగులాంబ అమ్మవారి దేవాలయం విద్యుత్తు దీపాల అలంకరణలో మిరుమిట్లు గొలుపుతోంది. రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ శ్రీజోగులాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. భారీగా తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించటంతో ప్రత్యేక శోభ సంతరించుకుంది. నవరాత్రుల్లో అమ్మవారు శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంటాదేవి, కూష్మాండదేవి, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదాత్రిగా ప్రత్యేక దర్శనమిస్తారు. రోజూ త్రిశతి, ఖడ్గమాల అర్చనలు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా కుమారి, సువాసిని పూజ నిర్వహిస్తారు. సహస్ర నామార్చన, నవవర్ణ అర్చన, తర్వాత చండీహోమం ఉంటాయి. 9న ఉదయం 10 గంటలకు మూలానక్షత్ర శుభ సమయమున జోగులాంబ అమ్మవారు, బాల బ్రహ్మేశ్వరస్వామి వారి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు సింహవాహన సేవ, 10న దుర్గాష్టమి సందర్భంగా ఉదయం 10 గంటలకు రథోత్సవం, 11న మహర్నవమి పురస్కరించుకుని కాళరాత్రి పూజ నిర్వహిస్తారు. 12న విజయదశమి రోజు ఉదయం 8 గంటలకు మహాపూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు శమీపూజ, 6.30 గంటలకు నదీహారతులు, జోగులాంబ అమ్మవారు, శ్రీబాలబ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంసవాహనంలో ఆసీనులను చేసి తుంగభద్ర నదిలో తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తారు.

గద్వాల సమీప జమ్మిచేడులో వెలసిన జములమ్మ ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతివారం మంగళ, శుక్రవారాల్లో 10వేల వరకు భక్తులు దర్శించుకుంటారు. కలశస్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభిస్తారు. రోజూ ఉదయం 8 గంటలకు విశేష ఫలపంచామృతాభిషేకం, అలంకరణ పూజలుంటాయి. తొమ్మిది రోజుల్లో మహాలక్ష్మీదేవి, గజలక్ష్మి, అన్నపూర్ణదేవి, శాకాంబరిదేవి, పార్వతి, ధనలక్ష్మి సరస్వతీమాత, దుర్గాదేవి, మహిషాసురమర్ధినిగా దర్శనమిస్తారు. చివరిరోజు జములమ్మ నిజరూపంలో దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు కోనేరులో తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలో సుమారు 15 వేలమంది వరకు భక్తులు పాల్గొంటారని ఆలయం ఈవో పురేందర్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. రోజూ తెల్లవారుజామున 4 గంటల నుంచి మూలవిరాట్టుకు అభిషేకాలతో పూజలు ప్రారంభిస్తారు. అలంకరణ, కుంకుమార్చన మహానివేదన తర్వాత భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. అమ్మవారిని 3న బాలత్రిపుర సుందరి, 4న లక్ష్మీదేవి, 5న గాయత్రీదేవి, 6న వనదుర్గాదేవి, 7న అన్నపూర్ణాదేవి, 8న శాకాంబరిదేవి, 9న సరస్వతీ దేవిగా అలంకరిస్తారు. 10న కాళికాదేవిగా నిమ్మకాయలు, గుమ్మడికాయలతో అలంకరణ చేసి కుంభం పోస్తారు. 11న దుర్గాదేవి 12న రేణుకాఎల్లమ్మగా అలంకరించి ఆలయ వద్ద ఉన్న జమ్మిచెట్టుకు పూజ చేస్తారు. స్థానిక అంబాభవానీ, కాళికాదేవి, మహబూబ్‌నగర్, జడ్చర్లలోని వాసవీమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నవాబుపేట మండలం కాకర్లపాడు పరిధి అటవీ ప్రాంతంలో వెలసిన ఫతేపూర్ మైసమ్మ దేవత భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్నారు. ప్రతి ఆది, మంగళవారాల్లో వేలాది భక్తులు దర్శించుకుంటారు. శరన్నవరాత్రుల్లో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తారని ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. నవరాత్రులను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటిరోజు గణపతిపూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, చక్రపూజ కైంకర్యాలతో అమ్మవారిని పూజిస్తారు. నవరాత్రుల్లో మూలవిరాట్టుకు రోజుకో అలంకరణ చేసి ఆరాధించనున్నట్లు ప్రధాన అర్చకుడు శ్రీకాంత్‌శర్మ తెలిపారు. మన్యంకొండ శ్రీవేంకటేశ్వరస్వామి, చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తిస్వామి, బీచుపల్లి ఆంజనేయస్వామి, మద్దిమడుగులోని ఆంజనేయస్వామి, పాలెం, కోస్గిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైష్ణవ సంప్రదాయం ప్రకారం వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు.

# కొండా సురేఖను బర్తరఫ్ చేయాలి

## సిఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదు

## రాజకీయం కోసం సినిమావాళ్లను అవమానిస్తారా

## మండిపడ్డ బిఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, నీలగిరి వార్త ప్రతినిధి

అక్కినేని నాగచైతన్య, సమంత విడిపోవడానికి మాజీ మంత్రి కేటీఆరే కారణమంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనాన్ని సృష్టిస్తోంది. ఈ వ్యాఖ్యలను ప్రతీఒక్కరూ ఖండిస్తున్నారు. సినీ ప్రముఖులు మంత్రి వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు. తాజాగా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ స్పందించారు. కొండా సురేఖను రాహుల్ గాంధీ మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ మాటలు రాజకీయాలు అంటే అసహ్యం వేస్తోందన్నారు. కొండా సురేఖ రాజకీయం కోసం సినిమా పరిశ్రమ వాళ్ళను అవమానించారన్నారు. సినిమా పరిశ్రమలో ఉన్న వాళ్ళను తప్పుడు వ్యక్తులుగా మంత్రి చిత్రీకరించారన్నారు. మంత్రి పొంగులేటి కుమారుడి చేతి వాచ్ వ్యవహారంలో ఈడీ రైడ్స్ జరిగాయని బీఆర్ఎస్ నేత అన్నారు. పొంగులేటి ఇంట్లో 1600 కోట్లు దొరికినట్లు ప్రచారం జరిగిందని.. బంగారం పెద్ద మొత్తంలో దొరికినట్లు తెలిస్తుందన్నారు. పొంగులేటి నివాసంలో ఏం దొరికిందో ఈడీ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. లెక్కకు మించిన ఆదాయం దొరికితే ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. రైడ్స్ తర్వాత గౌతమ్ ఆదానీ, పొంగులేటి, సునీల్ కనుగోలు ఐటీసీ కోహినూర్‌లో భేటీ అయ్యారని తెలిపారు. గౌతమ్ ఆదానీని అడ్డం పెట్టుకుని ఈడీ కేసుల నుంచి పొంగులేటి బయటపడే ప్రయత్నం చేస్తున్నారా అని ప్రశ్నించారు. బీజేపీతో అంటకాగే వ్యాపారవేత్తతో కాంగ్రెస్ నేతలకు ఏం పని అని అడిగారు. ప్రభుత్వపరమైన మీటింగ్ అయితే హోటల్‌లో ఎందుకు కలిశారని నిలదీశారు. హైడ్రా విషయంలో హైకోర్టు హెచ్చరించినా సీఎం రేవంత్ రెడ్డి ఆర్డినెన్స్ తెచ్చారన్నారు. బీజేపీ గవర్నర్ హైడ్రా ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపారని అన్నారు. కేటీఆర్‌ను టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్, హరీష్ రావులపై దాడులు చేస్తామని మైనంపల్లి అంటున్నారన్నారు. మూసీ సుందరీకరణపై పాలసీ డాక్యుమెంట్ ఉందా అని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణపై పరివాహక ఎమ్మెల్యేలతో మీటింగ్ ఎందుకు పెట్టలేదని అడిగారు.



NEELAGIRI VARTHA TELUGU DAILY
నీలగిరి వార్త
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# మరో నిదర్శనం




బిజెపి ఏలుబడిలో దర్యాప్తు సంస్థలు దుర్వినియోగమవుతున్న తీరుకు ఎన్‌డిటివి మాజీ ప్రమోటర్లు ప్రణయ్ రాయ్, రాధికా రాయ్ ల ఉదంతమే తాజా ఉదాహరణ! 2017లో వీరిపై నమోదు చేసిన కేసును సిబిఐ మంగళవారం మూసివేసింది. ఏడు సంవత్సరాల సుదీర్ఘ దర్యాప్తు కూడా ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో సిబిఐకి ఈ చర్య తప్పనిసరిగా మారింది. కేసు క్లోజర్ రిపోర్టులో కూడా ఇదే విషయాన్ని సిబిఐ అధికారులు పేర్కొన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వ ప్రజా కంటక విధానాలపై ఎలుగెత్తిన ఎన్‌డిటివిని గౌతమ్ అదానీ స్వాధీనం చేసుకుని, దాని నోరు పూర్తిగా నొక్కేసిన తరువాతే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఐసిఐసిఐ బ్యాంకుకు 48 కోట్ల రూపాయల మేర నష్టం కలిగించారంటూ 2017 జూన్‌లో వీరిపై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 2009లో జరిగిన రుణ సెటిల్మెంట్‌లో ఉద్దేశపూర్వకంగా మోసపూరిత విధానాలు అవలంబించడం ద్వారా బ్యాంకుకు 'రాయ్ 'లు ఈ నష్టం కలిగించారని సిబిఐ ఆరోపించింది. తమకు నష్టం కలిగిందంటూ ఐసిఐసిఐ బ్యాంకు ఎటువంటి ఫిర్యాదు చేయకుండానే, ఒక ప్రైవేటు వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సిబిఐ ఈ దర్యాప్తు ప్రారంభించడం గమనార్హం! ఈ చర్యను సిబిఐకి చెందిన మాజీ ఉన్నతాధికారులు సైతం తప్పు పట్టారు.

అయినా, సిబిఐ 'రాయ్'ల నివాసాలతో పాటు ఎన్‌డిటివి కార్యాలయాలపైనా దాడులు చేసి భయోత్పాతాన్ని సృష్టించింది. 2019లో 35కు పైగా షెల్ కంపెనీలు వున్నాయంటూ మరో కేసును దాఖలు చేసింది. ఈ చర్యలను పత్రికా స్వేచ్ఛపై దాడిగా పేర్కొంటూ దేశ వ్యాప్తంగా జర్నలిస్టులు ఆందోళన చేశారు. ప్రతిపక్షాలు కూడా వీరికి మద్దతు తెలిపాయి. అయితే, అధికారంలో ఉన్న వారికి అత్యంత విశ్వసనీయంగా ఉండటానికే అలవాటు పడిన సిబిఐ వీటిని ఏమాత్రం పట్టించుకోలేదు. సిబిఐతో పాటు ఇడి, ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్లు కూడా రంగంలోకి దిగాయి. 2022లో గౌతమ్ అదానీ గ్రూపు దొడ్డిదారిన ఎన్‌డిటివిని స్వాధీనం చేసుకుంది. ఎలాంటి ఆధారాలను చూపలేక సిబిఐ కేసును క్లోజ్ చేయడంతో ఈ వేధింపులు ఎందుకు జరిగాయో, ఎవరికోసం జరిగాయో దేశమంతా స్పష్టమైంది.

స్వతంత్ర మీడియా సంస్థగా 'రాయ్'ల హయాంలో ఎన్‌డిటివి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. ప్రజలను చీల్చే మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగాను, రైతాంగ ఆందోళనలకు మూల కారణాల వంటి అంశాలపైనా ఎన్నో కథనాలను ప్రసారం చేసింది. ఎన్‌డిటివిని అదానీ స్వాధీనం చేసుకోవడం స్వతంత్ర మీడియాపై జరిగిన పెను దాడిగా పలువురు అభివర్ణించారు. తనకు గిట్టని వారిపై మోడీ సర్కారు అమలు చేసే కక్ష సాధింపు చర్యలకు అది నిదర్శనం. ఈ తరహా కథనాలను వెలుగులోకి తీసుకొచ్చినందుకే న్యూస్‌క్లిక్ ఎడిటరైన 74 సంవత్సరాల ప్రబీర్ పురకాయస్థపై మోడీ ప్రభుత్వం విరుచుకుపడింది. విదేశాల నుండి అక్రమంగా నిధులు వచ్చాయని ఆరోపిస్తూ 225 రోజుల పాటు జైలులో నిర్బంధించింది. అరెస్ట్‌కు ముందు ఆయన నివాసం, కార్యాలయాలపై దాడులు చేసి భయోత్పాతం సృష్టించింది. చివరకు దేశ అత్యున్నత న్యాయస్థానం ఆయన అరెస్టును, రిమాండ్‌ను చట్ట వ్యతిరేకమైనవిగా పేర్కొంటూ బెయిల్ మంజూరు చేసింది.

## మార్కెట్లపై యుద్ధ మేఘాలు



**ముంబయి :**

పశ్చిమసియా దేశాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు భారత స్టాక్ మార్కెట్లను తీవ్ర ఒత్తిడికి గురి చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం స్టాక్ మార్కెట్లకు సెలవు కావడంతో ఒక్క పూట ఉపశమనం లభించింది. ఈ నెల 3న మాత్రం భారత స్టాక్ మార్కెట్లలో పెద్ద కల్లోలాన్ని సష్టించే వీలుందని నిపుణులు చెబుతున్నారు. సమీప భవిష్యత్తులో 10-15 శాతం వరకు దలాల్ మార్కెట్లు పతనాన్ని చవి చూసే వీలుందని డిఆర్ చోక్సీ ఫిన్‌సర్వ్ మేనేజింగ్ డైరెక్టర్ దేవన్ చోక్సీ తెలిపారు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ దీపక్ జసానీ ఇదే ఆందోళన వ్యక్తం చేశారు. స్వల్పకాలంలో క్షీణత 5-6 శాతం వరకు ఉండవచ్చు అని తెలిపారు. మరోవైపు ముడి చమురు ధరల పైపైకి ఎగబాకుతున్నాయి. ఒక్కరోజులోనే బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు దాదాపు 4 శాతం మేర ఎగిశాయి. ఇదేరీతిలో పెరుగుతూపోతే బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరవచ్చునని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వికె విజయకుమార్ పేర్కొన్నారు. చమురు ధరల పెరుగు దలతో పెయింట్స్, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, విమానయాన కంపెనీల షేర్లు ప్రతికూల ప్రభావాన్ని చవి చూడొచ్చని మోతీలాల్ ఓస్వాల్ అంచనా వేసింది.

## కొత్తగా 600 శాఖలు తెరుస్తాం : ఎస్‌బిఐ ఛైర్మన్ వెల్లడి

**న్యూఢిల్లీ :**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 600 శాఖలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, పెద్ద నివాస టౌన్‌షిప్పుల్లో వీటిని ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ప్రస్తుతం ఎస్‌బిఐకి 22,542 శాఖలు, 65వేల ఎటిఎం కేంద్రాలు, 85వేల బిజినెస్ కరస్పాండెంట్లు ఉన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 137 శాఖలను తెరిచింది. గ్రామీణ ప్రాంతాల్లో 50 శాఖలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 50 కోట్ల మంది వినియోగదారులకు సేవలందిస్తున్నామని శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ప్రతి భారతీయుడికి, కుటుంబానికి చేరువ కావాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. వాటాదారుల దృష్టిలోనే కాకుండా ఎస్‌బిఐతో అనుబంధం కలిగిన వారందరిలోనూ అత్యంత విలువైన బ్యాంక్‌గా తీర్చిదిద్దాలని నిర్దేశించుకున్నామన్నారు. డిపాజిట్ల సేకరణకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలను చేపట్టనున్నామన్నారు. డిపాజిట్లను ఆకర్షించేందుకు రికరింగ్ డిపాజిట్, సిప్ కాంబోలో వినూత్న ఉత్పత్తులను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. తమకున్న విస్తృతమైన నెట్‌వర్క్‌తో పెద్ద ఎత్తున డిపాజిట్లను సేకరించనున్నామన్నారు. ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరగడంతో పాటుగా వినియోగదారులు సైతం ఆర్థిక అంశాలపై అవగాహన పెరిగిందన్నారు.

# బ్యాంకింగ్‌లో భయాలు..!

## తగ్గుతున్న డిపాజిట్లు
## పెరుగుతున్న రుణాల జారీ
## మార్కెట్లు, ఎంఎఫ్‌ల్లో పెట్టుబడుల ఎఫెక్ట్
## ఇతర నిధుల సమీకరణపై దృష్టి

**న్యూఢిల్లీ :**

భారత బ్యాంకింగ్ రంగం డిపాజిట్ల సేకరణ సవాళ్లను ఎదుర్కొంటోంది. ఇటీవల డిపాజిట్లు తగ్గడం, రుణాలు పెరగడం పట్ల ఆర్‌బిఐ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఎఫ్‌డిలపై వడ్డీ రేట్లు తక్కువగా ఉండటంతో డిపాజిట్‌దారులు బ్యాంక్‌లకు క్రమంగా దూరం అవుతున్నారు. ఇదే విషయంపై గత నెల ఆర్‌బిఐ హెచ్చరించింది. ఈ అంశం బ్యాంకింగ్ రంగంలో పెద్ద చర్చకు దారితీయడంతో పాటుగా ఆ రంగంలోని వారిని ఆందోళనకు గురి చేస్తోంది. చాలా మంది స్టాక్ మార్కెట్లు, ఐపిఒలు, మ్యూచువల్ ఫండ్స్ వంటి అధిక రాబడుల వైపు డబ్బును మళ్లిచటంతో బ్యాంక్‌ల్లో డిపాజిట్లు సన్నగిల్లుతోన్నాయి. మరోవైపు రుణాలకు డిమాండ్ పెరగడంతో బ్యాంక్‌లు సమతూల్యం చేయలేని పరిస్థితి నెలకొంది.

ఆర్‌బిఐ తాజా గణాంకాల ప్రకారం.. ఇటీవలి కాలంలో బ్యాంకుల్లో డిపాజిట్ల సంఖ్య తగ్గిపోతోంది. బ్యాంకుల్లో డబ్బు జమ చేసే వేగం మందగిస్తోంది. దీన్ని అధిగమించడానికి బ్యాంక్‌లు చొరవ తీసుకోవాలని సూచించింది. దీంతో అప్రమత్తమైన భారతీయ బ్యాంకులు ఈ లోటును పూడ్చేందుకు నిధుల సమీకరణకు వెళుతున్నాయి. ప్రత్యామ్నాయంలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బాండ్లను జారీ చేయడం ద్వారా బ్యాంకులు రూ.1.3 లక్షల కోట్ల వరకు సమీకరించవలసి వస్తుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా నివేదించింది. ఇక్రా రిపోర్ట్ ప్రకారం.. దేశీయ బ్యాంకులు బాండ్ల జారీ మార్గంలో దాదాపు రూ.1.2 నుంచి రూ.1.3 లక్షల కోట్లను సమీకరిస్తాయని అంచనా. వాస్తవానికి ఇదే ఇప్పటి వరకు అత్యధికం కావటం గమనార్హం. డిపాజిట్లు, క్రెడిట్ వృద్ధి మధ్య నిరంతర అంతరం నెలకొనడంతో ఈ మార్గాన్ని ఎంచుకోవాల్సి వస్తోంది. దాదాపు 85 శాతం బాండ్లను ప్రభుత్వ రంగ బ్యాంకులే జారీ చేయనున్నాయని నివేదిక పేర్కొంది. దీనికి ముందు 2023-24 ఆర్థిక సంవత్సరంలో బాండ్లను జారీ చేయడం ద్వారా బ్యాంకులు రూ.లక్ష కోట్లు సమీకరించాయి. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.1.1 లక్షల కోట్లు సేకరించాయి. రుణాల వృద్ధి స్థిరంగా డిపాజిట్‌ల పెరుగుదలను మించిపోవడం వల్ల బ్యాంకులు ప్రత్యామ్నాయ వనరుల నుంచి నిధులను సేకరించాల్సిన అవసరం పడుతోందని ఇక్రా విశ్లేషించింది. బ్యాంకింగ్ రంగంలో డిపాజిట్లు తగ్గుతున్న నేపథ్యంలో ఆకర్షణీయ, వినూత్న డిపాజిట్ పథకాలను ప్రవేశపెట్టాలని ఇటీవల ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్‌బిఐ బోర్డు సమావేశంలో బ్యాంకర్లకు సూచించారు. డిపాజిట్లు, రుణాలు బండికి రెండు చక్రాల లాంటివని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. డిపాజిట్లుగా వచ్చిన నిధులను అవసరమైన వారికి రుణాలుగా సమకూర్చాలన్నారు. అప్పుడే డిపాజిట్లకు, రుణాలకు మధ్య ఉన్న అంతరం తగ్గుతుందన్నారు. ఇందుకోసం వినూత్న, ఆకర్షణీయ డిపాజిట్ పథకాలు అవసరమన్నారు. బ్యాంకుల్లో వడ్డీ రేట్లు కూడా తక్కువగా ఉన్నాయని అన్నారు. అనేక ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రి బ్యాంకర్లకు సూచించారు.




NEELAGIRI VARTHA TELUGU DAILY
నీలగిరి వార్త
తెలుగు దినపత్రిక

## బిజినెస్..

## భారత్‌లో మస్సే ఫెర్గూసన్ బ్రాండ్ మాదే..

### అగ్కోకు వ్యతిరేకంగా టఫె దిక్కార ఫిటిషన్



**చెన్నయ్ :**

అమెరికాకు చెందిన అగ్కో కార్పొరేషన్ చెన్నయ్ హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందున ఆ సంస్థపై దిక్కార పిటీషన్ దాఖలు చేసినట్లు ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టఫె) తెలిపింది. టఫే మాస్సే పెర్గూసన్ బ్రాండ్‌పై తమకే హక్కులు ఉన్నాయని ఇందులో పేర్కొంది. అగ్కోలో 2012లో కీలక వాటాను సొంతం చేసుకుని దాని ఏకైక పెద్ద వాటాదారుగా, దీర్ఘకాలిక పెట్టుబడిదారిగా మారినట్లు పేర్కొంది. 65 ఏళ్ల మాస్సే బలమైన ఆర్అండ్‌డి, 500 మోడల్స్ వాహనాలను కలిగి ఉన్నట్లు పేర్కొంది. ఏడాదికి 1,80,000 ట్రాక్టర్లను తయారు చేస్తే.. అందులో 1 లక్ష మాస్సే ఫెర్గూసన్ ఉత్పత్తి చేస్తుందని.. 30 లక్షల మంది సంతృప్తికర ఖాతాదారులు తమకున్నట్లు తెలిపింది. 80 దేశాలకు ఎగుమతులను కలిగి ఉన్న టఫె, మాస్సేను వేరువేరుగా చూడలేమని పేర్కొంది.

## పుష్ప2తో ఐటిసి మంగళదీప్ భాగస్వామ్యం

**హైదరాబాద్ :**

ప్రముఖ అగరుబత్తిల బ్రాండ్ ఐటిసి మంగళదీప్ త్వరలో విడుదల కానున్న పుష్ప2 ది రూల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా మంగళ్‌దీప్ సెంట్ 3 ఇన్ 1 అగర్బత్తి ప్యాక్‌ను విడుదల చేశామని ఆ కంపెనీ ప్రతినిధి గౌరవ్ తాయల్ తెలిపారు. అల్లూ అర్జున్ ముఖ చిత్రంతో రానున్న వీటిని తొలుత దక్షిణాదిలో అందుబాటులోకి తేనున్నామన్నారు.



## వెలుగొండ ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎప్పుడిస్తారు బాబు : గౌతు సాత్యేంద్రబాబు

### దొనకొండ ఇండస్ట్రియల్ కారిడార్ ఇంకెన్నాళ్ళు : షేక్ సైదా

### ఒంగోలు పాలడైరీ ఎప్పుడు ప్రారంభిస్తారు : రిహానా భాను

### తెదేపా వైకాపా ఇద్దరు తోడు దొంగలే...

బ్యూరో ఇంచార్జీ (కంచర్ల నాగేశ్వరరావు గౌడ్) : నీలగిరి వార్త

గురువారం నాడు ఒంగోలు పట్టణంలో గల కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీసీసీ జనరల్ సెక్రటరీ మరియు ప్రకాశం జిల్లా ఇన్చార్జి గౌతు సాత్యేంద్ర బాబు హాజరవడం జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా జిల్లా అధ్యక్షులు షేక్ సైదా బాధ్యత వహించారు.అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గౌతు సాత్యేంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిలా రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత వేగంగా బలపడుతుందన్నారు. అలాగే రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాలలో ప్రకాశంజిల్లా ఒకటి.అందులోనూ జిల్లాలో ఎన్నో ప్రధాన సమస్యలు ఉన్నాయని,వెలుగొండ ప్రాజెక్టు1996 మార్చి5న చంద్రబాబు తొలిసారిగా వెలిగొండ ప్రాజెక్టు కోసం శంకుస్థాపన చేశారు.సుమారుగా 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నేటికి వెలుగొండ ప్రాజెక్టు మొదలుపెట్టి 28 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ తమరు ఏందుకు పూర్తి చేయలేదో జిల్లా ప్రజలకు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారుఅయితే పనులు ముందుకు సాగలేదు.అలాగే దొనకొండ ఇండస్ట్రియల్ కారిడార్,ఒంగోలు పాలడైరీ, గుండ్లకమ్మ బ్రిడ్జి లాంటి పలు సమస్యలు ఎన్నో ఉన్నప్పటికీ గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో కానీ,వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో కానీ ఈ సమస్యల పరిష్కారానికి ఏటువంటి చర్యలు చేపట్టక పోవడం సిగ్గుచేటు అన్నారు. అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షులు షేక్ సైదా మాట్లాడుతూ ప్రకాశంజిల్లాలో గల పలు సమస్యల గురించి పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలా







రెడ్డి దృష్టికి తీసుకెళ్ళితే,ఆమె స్పందించి పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్ని" హామీ ఇచ్చినట్లుగా ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఉద్దండి మల్లికార్జున్,ఉంగరాల శ్రీను,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రిహానాబాను,యూత్ కాంగ్రెస్ నాయకులు దాసరి రవి కైపు వెంకటకృష్ణారెడ్డి,గిద్యోను,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొడ్డు సతీష్,చిరంజీవి,గుత్తి రాజు, పోలు.మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో మళ్లీ కలహాలు మొదలయ్యాయా?









### ప్రజల కష్టాలు తెలుసుకోడం కంటే గొడవలకే ప్రాముఖ్యత?

### హైడ్రా నిర్ణయం తప్పని స్వపక్ష నేతలే ధిక్కార స్వరం?

### తాజాగా మంత్రి సురేఖ సమంత కేటీఆర్ల పై చేసిన వ్యాఖ్యలు?

### విపక్ష పార్టీలకు అస్త్రాలుగా మారుతున్న నేపథ్యం?

### సెల్ఫ్ డిఫెన్స్‌లో రేవంత్ ప్రభుత్వం పడిందన్న చర్చ?

తెలంగాణ బ్యూరో ఛీఫ్ నీలగిరివార్త

కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం ఏంటో మరోసారి బయటపడుతోంది. కాంగ్రెస్ అంటేనే కలహాల పార్టీ అని మొదటి నుండి ప్రచారం లో ఉంది. కాంగ్రెస్ పార్టీలో నిత్యం గ్రూప్ తగాదాలు నడుస్తాయని ప్రజలు, పార్టీ అవసరం లేదు మాకు మీమే గొప్ప అనే స్వభావం ఉంటుందని పార్టీలో ఒకరి ఎదుగుదలను ఏమాత్రం జీర్ణించుకోలేరని పార్టీలో ఓ నేతపై విమర్శలొస్తే సదరు నేతకు సపోర్ట్ ఉండడం మానేసి ఇంకాస్త అవతలి వ్యక్తులను రెచ్చగొట్టేలా చేస్తారని ప్రజల కష్టాలు తెలుసుకోవడం కంటే గొడవలకే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుంటారని మొదటి నుండి అంతా మాట్లాడుకుంటుంటారు.ఇక ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కూడా అదే జరుగుతున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఎవ్వరు ఊహించలేదు. రేవంత్ దూకుడు , మాట తీరు చూసే చాలామంది కాంగ్రెస్ ఫై నమ్మకం పెట్టుకున్నారు. ఉచిత హామీలు , రేవంత్ ఏదో చేస్తాడని ప్రజలు భావించి ఓట్లు వేశారు. కానీ ఓట్లేసి గెలిపించిన తర్వాత ఇప్పుడు అదే ప్రజలు బాధపడుతున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ఆ ప్రజలనే రోడ్డున పడేస్తుండడంతో తట్టుకోలేక పోతున్నారు. ముఖ్యంగా హైడ్రా నిర్ణయం అనేది కాంగ్రెస్ తీసుకున్న పెద్ద తప్పని అంటున్నారు. ఈ మాట విపక్షాలే కాదు కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం పబ్లిక్ గా అంటున్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా మూసీ పరివాహాక నిర్మాణాలను కూలుస్తున్నామని సీఎం అంటుంటే మరికొంతమంది మాత్రం హైడ్రా కు మాకు సంబంధం లేదు.సీఎం తీసుకున్న నిర్ణయమే అని అంటున్నారు.హైడ్రా తమ జోలికి వస్తే ఊరుకునేది లేదంటూ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అల్టిమేటం ఇచ్చారు. ఇక మూసీ ప్రక్షాళన విషయంలో పేదల ఇళ్లపై గడ్డపారలు ఎలా దిగుతాయో చూస్తానంటూ మరో నేత మాజీ ఎంపీ మధు యాష్కీ హెచ్చరించడం కూడా పార్టీలో నేతల తీరును సూచిస్తుంది. ఇలా సొంతపార్టీ నేతలే ధిక్కార స్వరం వినిపిస్తుండటం విపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ లకు అస్త్రాలుగా మారుతున్నాయి. దాంతో సెల్ఫ్ డిఫెన్స్‌లో రేవంత్ ప్రభుత్వం పడిందన్న చర్చ నడుస్తోంది.హైడ్రా,మూసీప్రక్షాళనపై సామాన్యుడి నుంచి న్యాయస్థానం వరకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాజాగా మంత్రి కొండా సురేఖ సమంతను అడ్డుపెట్టి కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలతో పాటు,సినీ ఇండస్ట్రీ ని షేక్ చేస్తోంది.దీంతో అసలు కాంగ్రెస్ పార్టీకి ఏమైందని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.ఓ మాట

## అనేటప్పుడు ఆచితూచి అనాలి.

ఆ మాటల వల్ల పార్టీకి ఎంత నష్టం వాటిల్లుతుంది? వారి మనోభావాలు దెబ్బతీస్తాయి కదా? సమాజంలో ఎంతో గుర్తింపు ఉన్న ఫ్యామిలీ ఫై అలాంటి వ్యాఖ్యలు చేయొచ్చా? అనేది కూడా తెలియకుండా వ్యవహరిస్తున్నారు. దీనిపై సీఎం సైతం సైలెంట్ గా ఉండడం వల్ల పార్టీకి ఎక్కువ డ్యామేజ్ తప్ప మరోటి లేదు. బీఆర్ఎస్ పార్టీ విషయానికి వస్తే అధినేత కు తెలియకుండా ఎవ్వరు ఏమి మాట్లాడారు? ఎవరైనా విమర్శలు చేయాలన్న ముందుగా కేసీఆర్ దగ్గరికి వెళ్లి అనుమతి తీసుకునేవారు. కానీ కాంగ్రెస్ లో మాత్రం ఆలా కాదు ఎవరికీ వారే యమునా తీరే అన్నట్లువ్యవహరిస్తుండడం తో ప్రజల్లో రోజు రోజుకు కాంగ్రెస్ పార్టీ ఫై నమ్మకం పోతుంది. మరి ఇప్పటికైనా నేతల తమ తీరు మార్చుకుంటారా? లేక మాకు మీమే అన్నట్లు ముందుకు వెళ్తారా? అనేది చూడాల్సిఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# ప్రకాశంజిల్లాలో ప్రైవేట్ సిండికేట్...

### ప్రైవేటు ల్యాబ్‌లు,స్కానింగ్ సెంటర్ల ఇష్టారాజ్యం...

### అనుభవం లేని టెక్నీషియన్లతో నిర్వహణ...

### మాఫియాగా మారిన యాజమాన్యాలు...

### ప్రిస్క్రిప్షన్ రాసే డాక్టర్లకు ప్రోత్సాహకాలు...

### రోగులను నిలువు దోపిడీ చేస్తున్న నిర్వాహకులు...

### మెడికల్ షాపులు అధికంగా పన్ను ఎగవేతలు...

బ్యూరో ఇంచార్జీ(కంచర్ల నాగేశ్వరరావు గౌడ్) : నీలగిరి వార్త

జిల్లాలో పలు ప్రైవేట్ ఆసుపత్రులు మెడికల్ మాఫియాగా మారి నిలువుదోపిడీ చేస్తున్నాయి. ఆయా హాస్పిటళ్లకు రోగులను పంపేందుకు యాజమాన్యాలు జిల్లావ్యాప్తంగా పీఆర్వో వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాయి.అంతేకాకుండా ప్రైవేటు ల్యాబ్‌లు,స్కానింగ్ సెంటర్లు ఇష్టార్యాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలకు భారంగా మారాయి.ప్రభుత్వ నియమ,నిబంధనల మేరకు ప్రజలకు సేవలందించాల్సిన ప్రైవేటు ల్యాబ్‌లు,స్కానింగ్ సెంటర్లు,ఆస్పత్రులు అందినంత దోచుకుంటున్నాయి.మరికొన్ని ల్యాబ్‌లు,స్కానింగ్ సెంటర్లు ఆస్పత్రులు ఉన్నదే దోచుకునేందుకు అన్నచందంగా తయారైన్నాయి.కొంచెం ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రులకు వెళ్తే చాలు జేబుకు చిల్లుపడుతోంది.అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రైవేటు టెస్టింగ్ ల్యాబ్‌లు,స్కానింగ్ సెంటర్లు రెచ్చిపోతున్నాయి.కొన్నిచోట్ల వైద్యుల సూచనలు లేకుండానే స్కానింగ్‌లు,టెస్టులు చేసేస్తున్నారు.ఇతర పరీక్షలకు సైతం అదే పరిస్థితి ఉంటోంది.ఇంత దోపిడీ జరుగుతున్నా వైద్యఆరోగ్యశాఖ అధికారులు మాత్రం ఏమీ పట్టించుకోవడం లేదనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.స్కానింగ్ సెంటర్లు,ల్యాబ్‌ల్లో ధరల పట్టికలను ప్రదర్శించకుండా రిఫరల్ డాక్టర్లకు కమిషన్లు ఇచ్చి అందినంత దోచేస్తున్నారు.ఇటీవల కాలంలో జిల్లాలోని కొన్ని పీసీహెచ్‌సీలో పనిచేసే కొంతమంది ల్యాబ్ టెక్నీషియన్లు కాసులకు కక్కుర్తిపడి బయట ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులతో కుమ్మక్కై ఆస్పత్రికి వచ్చేవారిని ప్రైవేటు ల్యాబ్‌లకు పంపుతూ,వారి నుంచి కమీషన్లు లాగేస్తున్నారు.పైగా మేము చెప్పిన ల్యాబ్‌లోనే మీరు వైద్యపరీక్షలు చేయించుకోవాలి లేదంటే డాక్టర్ ఒప్పుకోరని రోగులకు చెప్పడంతో చేసేదిలేక ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.ప్రస్తుతం ధనార్జనే ధ్యేయంగా మెడికల్ షాపులు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నాయి.బీఫార్మసీ,డీఫార్మసీ ఉత్తీర్ణులైన వారే మెడికల్ షాపులను పెట్టాల్సిఉన్నప్పటికీ%%జిల్లాలో మెజారిటీ మెడికల్ షాపులు ఇందుకు విరుద్ధంగా నడుస్తున్నాయి.అనుమతులు ఒకరి పేరు పై తీసుకుని మరొకరు మెడికల్ షాపును నిర్వహిస్తున్నారు.ఏడాదికి ఇంత అని నిర్వాహకులు ఫార్మసీ సర్టిఫికెట్ ఇచ్చిన వ్యక్తికి ముట్టచెబుతున్నారు.అనర్హులు మెడికల్ షాపులను నిర్వహిస్తుండడంతో ఒక మందుకు బదులు మరో మందు ఇస్తూ రోగుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు.వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వొద్దని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా మెడికల్ షాపులు బేఖాతరు చేస్తున్నాయి.



### రాష్ట్ర ప్రభుత్వానికి పన్ను ఎగవేతలు కూడా...

జిల్లా వ్యాప్తంగా సుమారుగా 4,500 మెడికల్ షాప్‌లు ఉండగా,వీటిలో సగానికి పైగా షాపుల్లో కంప్యూటరైజ్డ్ బిల్లు ఇవ్వడం లేదు.కేవలం తెల్లకాగితాలు,డాక్టర్ రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ వెనుకవైపు బిల్లులు రాసి ఇస్తున్నారు.దీనివల్ల మెడికల్ షాప్‌ల నిర్వాహకులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను తగ్గుతోంది. అంతేకాదు మందుల తయారీదారులు ఇచ్చే డిస్కౌంట్లు సైతం గాల్లో కొట్టుకుపోతున్నాయి.మొత్తానికి మెడికల్ సిండికేట్‌వ్యవహారం కారణంగా జిల్లాలో ఔషధాల ధరలు చుక్కలనంటుతున్నాయి.ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఏ పరీక్షకు ఎంత ఫీజు వసూలు చేస్తారు,ఏ శస్త్ర చికిత్సకు ఎంత డబ్బు చెల్లించాలి అనే బోర్డులను ప్రదర్శించాల్సి ఉంటుంది.కానీ ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య చికిత్స కోసం దేనికెంత చెల్లించాలి అని సూచించే బోర్డులు లేవు. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న డయోగ్నోస్టిక్స్, ఫిజియోథెరపీ,పాథాలాజికల్ ల్యాబ్‌లు ఫీజుల విషయంలో కూడా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నప్పటికీ అప్పుడప్పుడు వైద్య,ఆరోగ్యశాఖ నిర్వహించే తనిఖీల్లో ఈ విషయాల గురించి పట్టించుకోవడం లేదన్నే విషయం స్పష్టంగా ప్రజలకు అర్థం అవుతుంది.పలు పత్రికలలో కథనాలు ప్రచురితమైనపుడు మాత్రం హుటాహుటిగాకేవలం ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఆ పరిధిలో మాత్రమే తనిఖీలు నిర్వహించి తనిఖీలను కూడా అన్ని ఆసుపత్రుల్లో పూర్తి చేయకముందే ఉన్నతాధికారుల నుంచి వెంటనే నిలిపివేయాలని మౌఖిక ఆదేశాలు అందాయని ఆపేశారు.దీంతో నామమాత్రపు తనిఖీలు కూడా నిలిచిపోయి ప్రైవేట్ ఆసుపత్రుల వారు ఊపిరి పీల్చుకుకోవడం అనవాయితీగా మారిపోవడంతో జిల్లా అధికార యంత్రంగం పట్ల ప్రజలకు రోజురోజుకు కనీస గౌరవం కూడా లేదంటే నమ్మండి అంటూ సామాజిక మేధావులు వాపోతున్నారు.

Printed, Published and Owned by GUNTOJU VISHNUMURTHY, Printed at V.M PRINTERS Plot.no.108, shivashakar colony, kuntloor (vill) Abdullapurmet(md) Dist. Rangareddy Telangana, Published at V.M PUBLCATIONS Plot.no.108, shivashakar colony, kuntloor (vill) Abdullapurmet(md), Dist.Rangareddy, Telangana state pin : 501505. Editor : GUNTOJU VISHNUMURTHY, RNI NO. APTEL/31957/2009, cell no.9676549223